క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 15వ తేదీ శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు చల్లస్తాసెంటర్, చెమ్మనగిరిపేట, బలరామునిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని గోవిందరావు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: అనుమానాస్పద స్థితిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఒక వ్యక్తి చనిపోయిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని దావోజీపాలెం గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశ్వరరావు (79) వారం రోజులల కిందట తీవ్రంగా గాయపడటంతో మచిలీపట్నం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. గుంటూరు అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు భార్య హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి



మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని తహసీల్దార్ కార్యాయంలో డీటీ వాణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శ్మశానంలో ఆక్రమణలు తొలగించి, జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, రోడ్డు, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతిపత్రంలో కోరారు. మాజీ సర్పంచ్ కర్రా వెంకటేశ్వరావు, యర్రంశెట్టి సునీల్, మెరకనపల్లి సుబ్బారావు, నంద్యాల ప్రభురావు, సోమిశెట్టి వెంకట రమణ, బొందలపాటి బసవయ్య, అద్దంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుము తీత పనులు

పెడన: మండలంలో ముమ్మరంగా మినుము తీతపనులు సాగుతున్నాయి. మినుము పైరు బాగుందనుకుంటున్న దశలో తెలియని వైరస్ చుట్టుముట్టి మినుము పైరును దెబ్బతీయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినుము తీత పనులకు వచ్చే కూలీలకు ఒక్కొక్కరికి రూ.400, ఆటో చార్జీలకు రూ.30 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎకరానికి 10 మంది నుంచి 16 మందిని వినియోగిస్తున్నారు. ఎకరానికి మినుము తీత పనులకు రూ.4,300 నుంచి రూ.6,880 వరకు వెచ్చించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. నూర్పిళ్లకు రూ.2 వేలకుపైగా ఖర్చు అవుతోందని, ఇంత ఖర్చుపెట్టినా మినుము విక్రయించే సమయానికి ధర ఉంటుందో లేదో అనే ఆందోళన ఉందని వాపోతున్నారు.

ఆర్‌ఎస్‌కేలకు క్యూ కట్టిన రైతులు



పెడన: మండలంలోని రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేసేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది సిద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామ సచివాలయాల్లోను, రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు, ఎంపీఈవోలు రైతుల నుంచి వివరాలను సేకరిస్తూ నమోదు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగా భవిష్యత్తులో పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలు ఇవ్వనున్నారనే సమాచారంతో రైతులు ఆయా సచివాలయాల్లో బారులు తీరుతూ నమోదు చేయించుకుంటున్నారు. రైతుకు సంబంధించి రిజిస్టర్ డాక్యుమెంట్లతో పాటు పట్టదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబరు, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో వీటిని నమోదు చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీలోగా వీటిని నమోదు చేయాలని వ్యవసాయశాఖఅధికారులు పేర్కొవడంతో రైతులు సచివాలయాలకు, ఆర్ఎస్‌కేలకు పరుగులు పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



మోపిదేవి: స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కేసగాని రాంబాబు భవనంపై నుంచి పడి హాస్పటల్‌లో చికిత్స పొందారు. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాంబాబును దివి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్ కుమార్, రెడ్రౌతు రాంప్రసాద్, మీసాల చిట్టిబాబు, బాబూరావు ఉన్నారు.

విద్యార్థులకు రక్షణ కరువు

- ప్రధాన రహదారి వెంబడి పాఠశాలలు
- స్పీడ్ బ్రేకర్లు, స్కూల్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్





పరాసుపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ వద్ద రహదారిపై అస్తవ్యస్తంగా ట్రాఫిక్, కానరాని స్పీడ్‌బ్రేకర్లు : నిర్మల హైస్కూల్ వద్ద విద్యార్థుల రాకపోకలు

మచిలీపట్నంటౌన్: పలు పాఠశాలల విద్యార్థులకు రక్షణ కరువవుతోంది. పాఠశాలలకు రాకపోకలు సాగించే సమయంలో ఎటు నుంచి ఏ ప్రమాదం వస్తుందోనని భయాందోళనలకు తల్లిదండ్రులు గురవుతున్నారు. నగరంలో ఇటీవల కాలంలో వాహనాల రద్దీ మరింత పెరగటం తల్లిదండ్రుల ఆందోళనకు కారణమవుతోంది. పాఠశాలల వద్ద రోడ్లపై స్పీడ్‌బ్రేకర్లు, స్కూలు సూచిక బోర్డులు లేకపోవటంతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఏర్పడుతోంది.

ప్రధాన రహదారి వెంబడి పాఠశాలలు..

నగరంలోని పలు ప్రధాన రహదారుల వెంబడి పాఠశాలలు ఎక్కువగానే ఉన్నాయి. దీంతో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో వాహనాలు వేగంగా వస్తుండటంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలోని రేవతి సెంటరు సమీపంలో బాలాజీ విద్యాలయం, ఈ.కె.బాలభాను, రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్, జవ్వారుపేటలోని శ్రీ వేంకటేశ్వర హైస్కూల్, శ్రీరామకృష్ణ హైస్కూల్, నిర్మలా హైస్కూల్, సెయింట్ ఫ్రాన్సిస్, హైనీ హైస్కూల్, ఇలా పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు ప్రధాన రహదారుల వెంబడి ఉన్నాయి. ఈ పాఠశాలలకు విద్యార్థులు వచ్చి వెళ్లే సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు లేక..

స్కూల్ జోన్ పరిధిలో వేగ నియంత్రణ ఉంటుంది. అందుకు తగినట్టుగా స్కూల్ ఉన్నట్టు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వేగ నియంత్రణకు మార్కింగ్ కూడా ఇవ్వాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే ఆయా స్కూళ్ల వద్ద ఇవేమీ కనిపించడంలేదు. ప్రధాన రహదారులపై పాఠశాలలు ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉన్నతాధికారి చెప్పినా..

అధిక రద్దీ ఉండే బాలాజీ విద్యాలయం, సెయింట్ ఫ్రాన్సిస్ వంటి స్కూళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో ఇబ్బందిగా మారింది. ఇటీవల అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ డీకే బాలాజీ స్కూళ్ల వద్ద ఉన్న రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ సూచన అధికారులు ఎప్పటికి అమలు చేస్తారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.



జవ్వారుపేటలోని శ్రీ వేంకటేశ్వర హైస్కూల్ వద్ద ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేని దృశ్యం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



రహదారుల వెంబడి ఉన్న పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. రహదారుల్లో వాహనరద్దీ పెరిగింది. పాఠశాలలకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలను కొంత వరకైనా నివారించేందుకు స్పీడ్‌బ్రేకర్లు ఎంతో అవసరం. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతో వాహనాల వేగం తగ్గి ప్రమాదాలు తగ్గుతాయి.

– ఎం.సత్యనారాయణ,
శ్రీ వేంకటేశ్వర హైస్కూల్, హెచ్ఎం

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

చల్లపల్లి: 108లో పనిచేస్తున్న ఎస్టీ, ఎస్సీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తూ.. ఇప్పటికే అనేక మంది ఉద్యోగులను బాధ్యతల నుంచి తొలగించి పైశాచిక ఆనందం పొందుతున్న 108 ఏఈ వెంకటేశ్వరరావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఇటీవల చల్లపల్లి 108లో పనిచేస్తున్న ఈఎంటి దాసి బసవరాజు ఉన్నతాధికారులు తనను వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులతో ఇబ్బంది పడుతున్న ఇతర 108 ఉద్యోగులు కూడా శుక్రవారం మాల మహానాడు నాయకులను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఏఈ వెంకటేశ్వరరావు కొందరు మహిళలను కూడా వేధింపులకు గురిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న వెంకటేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా గోవర్ధన్ హెచ్చరించారు.



మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్‌ను కలిసిన 108 ఉద్యోగులు

పోషకాహారంతోనే తల్లీ బిడ్డలకు ఆరోగ్యం

ఘంటసాల: పోషకాహారంతోనే తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని మండల ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్లు టి.రమానాగమణి, శ్రీకాకుళం సెక్టార్ డి.మేరీలు తెలిపారు. ఘంటసాల జడ్పీ హైస్కూల్లో మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్ భీ, పఢాయి భీ శిక్షణ తరగతులు రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు ప్రసవించగానే అరగంట లేక గంటలోపు చిన్నారికి ముర్రిపాలను తాగిస్తే వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలను ప్రదర్శన ద్వారా వివరించారు. శిక్షణ పొందిన కార్యకర్తలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపిదేవి: బిడ్డ పుట్టకముందునుంచే నవచేతన, ఆదర్శశాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీపై రెండో రోజు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0- 6 సంవత్సరాల వయస్సు గల ప్రీస్కూల్ పిల్లలకు శారీరక, మానసిక, భాషాభివృద్ధి వంటి ఐదు అంశాలపై శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కార్యకర్తలు సహనం, ఓర్పుతో పిల్లలకు ఏది కావాలో ముందుగా గ్రహించి, అది చెప్పే విధంగా శిక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సీడీపీవో శేషుకుమారి, సూపర్‌వైజర్లు రత్నమాల, నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారానే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ భీ, పఢాయి భీ పేరుతో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీడీపీవో పాల్గొని పలు విషయాలపై మాట్లాడారు. 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషణ, విద్య గురించి, బాలింతలు, గర్భవతులు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యం గురించి వివరించారు. ఈ శిక్షణద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్యామలాగౌరీ, రాఘవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మోపిదేవిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శేషుకుమారి



కృత్తివెన్నులో మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

ఘనంగా మాజీ సీఎం సంజీవయ్య జయంతి

అవనిగడ్డ: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని స్థానిక గాంధీక్షేత్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. మానవతావాదిగా, కార్మికవాదిగా సంజీవయ్య సేవలు అందించారని కొనియాడారు. ఆయన హయాంలో రాష్ట్రంలో లక్ష చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ఆరులక్షల ఎకరాలు భూపంపిణీ చేయడంతో పాటు కాపులకు రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగాల్లో పదోన్నతల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదే అన్నారు.

కె.కొత్తపాలెం(మోపిదేవి): రాజకీయాలలో విలువలు, నిజాయితీ, నిబద్ధతకు ప్రతి రూపంగా దామోదరం సంజీవయ్య నిలిచారని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. కె.కొత్తపాలెంలో ఏపీ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఉద్యోగులు వాకా సుబ్రహ్మణ్యం, కె.పద్మజ, ఎల్.హిమజ, ఎస్.శిరీష, జి.కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: దివంగత దామోదరం సంజీవయ్య చేసిన సేవలు ఎనలేనివని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఘంటసాల కేవీకేలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధారాణి, శాస్త్రవేత్తలు



అవనిగడ్డలో దామోదరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



కె.కొత్తపాలెంలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విశ్వనాథపల్లి గ్రామస్తులు

జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్

కోడూరు: తమ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ విశ్వనాథపల్లి గ్రామస్తులు శుక్రవారం నిరసన ధర్నా చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పెద్ద ఎత్తున నినదించారు. 60 ఏళ్ల నుంచి గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాల కొనసాగుతుందని, అయితే ప్రభుత్వ నూతన విద్యా విధానం వల్ల ఈ పాఠశాల ప్రాథమిక పాఠశాలుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 103 మంది విద్యార్థులు చదువుతున్నారని, అయితే 6 నుంచి 8వ తరగతి వరకు ఉన్న 49 మంది విద్యార్థులను వి.కొత్తపాలెం జెడ్పీ పాఠశాలకు పంపి, ఈ పాఠశాలలో కేవలం 1 నుంచి 5వ తరగతి వరకు మాత్రమే తరగతులు నడిపేందుకు విద్యాశాఖ మౌలిక ఆదేశాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి 9,10 తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు బయట ప్రాంతాలకు వెళ్లి చదువుతున్నారని, తమ గ్రామంలోనే ఉన్నత పాఠశాల ఏర్పాటు చేస్తే పిల్లలందరూ ఊళ్లోనే చదువుకుంటారని గ్రామస్తులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో లక్షల్లో ఫీజులు కట్టలేక తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్నట్లు తల్లిదండ్రులు చెప్పారు. పాఠశాల ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మినుము పంట పరిశీలన

వి.రుద్రవరం(ఘంటసాల): మినుము పంటలో పేను బంక ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని వి.రుద్రవరం గ్రామంలో మినుము పంటలను రైతులతో కలసి ఏవో మురళీ కృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మినుము పంటలో పేనుబంక ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. పేనుబంక ఆశించిన మినుము మొక్కలు మొక్క కాండం మొదలు నుంచి చివర వరకూ రసం పీల్చు పురుగులు చుట్టూ చేరి మొక్క నుంచి రసంపీల్చి వడలిపోయేలా చేస్తాయన్నారు. దీంతో దిగుబడులపై తీవ్రంగా ప్రభావితం చూపిస్తుందన్నారు. రైతులు వెంటనే డైమిథోయేట్ 400 మిల్లీ మీటర్లు ఒక ఎకరా చొప్పున పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని ఏవో తెలియజేశారు. వీఏఏ బి.దిలీప్, రైతులు పాల్గొన్నారు.

యూపీ పాఠశాల స్థాయి పెంచాలి



నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప ప్రభుత్వ యూపీ పాఠశాలను జెడ్పీపాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులు ఎంఈఓ దుర్గా సాగర్‌కు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో 6 నుంచి 8వ తరగతి వరకు 31 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు గ్రామస్తులంతా సహకరిస్తారని, అధికారులు కూడా గ్రామస్తులకు సహకరించాలని వినతిపత్రంలో వేములపల్లి వెంకట్రామయ్య, జన్ను శ్రీనివాసరావు, సీహెచ్ ఏడుకొండలు, వి.శాంతిస్వరూప్, టీ శ్రీనివారావు తదితరులు కోరారు.

డిజిటల్ లైబ్రరీ, మ్యూజియం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక ప్రధాన రహదారిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండర్స్ బ్రాంచ్ మొదటి అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ పట్టాభి డిజిటల్ లైబ్రరీ, మ్యూజియంను ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్, స్టేట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ సీవీఎస్ భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా యూనియన్ డిజిటల్ పబ్లిక్ లైబ్రరీని ఫౌండర్స్ బ్రాంచ్‌లో ప్రారంభించామన్నారు. మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ లైబ్రరీని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ లైబ్రరీ విద్యార్థుల పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తమ బ్యాంక్ ఎప్పుడూ ప్రజలు, ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తుందన్నారు. ఈ ప్రాంత పెద్దల అభ్యర్థన మేరకు ఫౌండర్స్ బ్రాంచ్ పేరును పట్టాభి సీతారామయ్య బ్రాంచ్‌గా మార్చాలని తమ సెంట్రల్ ఆఫీసుకు సిఫారసు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ కాటం వెంకట్రావు, డిప్యూటీ రీజినల్ హెడ్స్ రామలింగారెడ్డి, తాతాజీ, బ్రాంచ్ హెడ్ ఝాన్సి, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సాయి మోహన్, మునీర్, విశ్వేశ్వరరావు, రాజారాం తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళులు అర్పించారు.



లైబ్రరీ, మ్యూజియంను ప్రారంభిస్తున్న జీఎం భాస్కరరావు, రీజినల్ హెడ్ వెంకట్రావు తదితరులు

క్రీడా పోటీల్లో సత్తాచాటిన బాలికలు



ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకున్న లింగారెడ్డిపాలెం విద్యార్థినులు

కోడూరు: కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల బాలికలు సత్తాచాటారు. ఈ నెల 11, 12 తేదీల్లో అవనిగడ్డ జెడ్పీ పాఠశాలల్లో 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో కబడ్డీ, ఖోఖో పోటీల్లో బాలికలు ప్రథమస్థానం, సీనియర్ బాల్ బాడ్మింటన్, జూనియర్ ఖోఖో విభాగాల్లో ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం నాగరత్న కుమారి తెలిపారు. స్పోర్ట్స్ అంశాల్లో సీనియర్ బాలికల విభాగంలో ఐదు క్రీడల్లో ప్రథమస్థానం, జూనియర్స్ విభాగంలో మూడు పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. ఓవరాల్ చాంఫియన్ షిఫ్ కైవసం చేసుకున్న బాలికలను ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ బండే పాండులింగప్రసాద్‌ను సత్కరించారు. ఇటీవల కోడూరులో జరిగిన పోటీల్లో కూడా లింగారెడ్డిపాలెం బాలికలు ఓవరాల్ చాంఫియన్‌గా నిలిచి నియోజకవర్గ స్థాయిలో సత్తాచాటారు.

ఘనంగా గంగానమ్మ జాతర

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో గంగానమ్మ అమ్మవారి ప్రధాన జాతరను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో మహిళలంతా ఒకేసారి నైవేద్యాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. పలువురు భక్తులు శిరస్సుపై గండు దీపాలతో చలువ బట్టలపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు కర్రసాము, వీరతాడు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై చిన్నఅమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు శ్రీ కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట చెక్కల మేడ వీధిలో శ్రీ కోదండరామునికి నూతన ఆలయం ఒనగూరింది. ఈ ప్రాంతంలో 110 సంవత్సరాల చరితకల పురాతన ఆలయం స్థానంలో భక్తులు నూతన ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయం, పలువురు దేవతామూర్తుల విగ్రహాలను శనివారం ఉదయం 10.28 గంటలకు ప్రతిష్ఠించేందుకు హోమ, పూజా కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించనున్నారు. ఆలయ పునఃప్రతిష్ఠతో పాటు ఆలయంలో శ్రీసీత, శ్రీ కోదండరామచంద్రమూర్తి, శ్రీ లక్ష్మణస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వార్ల పంచలోహ విగ్రహాలను బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించేందుకు పూజా కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభించారు.



స్వచ్ఛందంగా జంగిల్ క్లియరెన్స్

కోనేరుసెంటర్: కానూరు గ్రామంలోని పంట కాలువ గట్టుపై శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. కానూరు నుంచి సుమారు ఏడు కిలో మీటర్ల మేర నందమూరు వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల్లో గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గండ్లు పూడ్చివేత పనులు కూడా చేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, సిద్ధిరెడ్డి పాండురంగారావు, గమిడి రంగారావు, అల్లం పెద్దిరాజులు, జొన్నల రామాంజనేయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 21 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 21 మంది లబ్ధిదారులకు రూ.18,86,311 విలువగల చెక్కులను బుద్ధప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నియోజకవర్గంలో 116 మందికి రూ.92.88 లక్షలు చెక్కులు పంపిణీ చేసినట్టు చెప్పారు.